క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి

హుజూరాబాద్: పంటలు ఎండిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్ఎస్వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి కోరారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంట నష్టం అంచనా వేసి ఎకరాకు రూ. పదివేల పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంతవరకు అందలేదని, యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమైనందున క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కింద కౌలు రైతులుకు ఎకరాకు రూ.15 వేలు, భూమిలేని వ్యవసాయ కూలీలలకు రూ.12 వేలు ఇవ్వాలని, రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్నీ వ్యవసాయ పంటలకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సమ్మయ్య, సదానందం, రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌మాస్టర్‌కు వీడ్కోలు



ముధగౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మంగళవారం గెజిటెడ్ హెడ్‌మాస్టర్ మధుగౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు హెచ్‌ఎంను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

జీపీ భవన నిర్మాణ పనులు నిలిపివేయాలి



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో సాంబయ్యపల్లె గ్రామస్తులు

గన్నేరువరం: గ్రామ శివారులో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి సొంత స్థలంలో జీపీ భవన నిర్మాణం చేపట్టొద్దని కోరుతూ సాంబయ్యపల్లె గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుల ఏకాభిప్రాయం లేకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని, ఆస్థలంలో జీపీ భవనం నిర్మిస్తే ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, గ్రామంలో మరోచోట నిర్మాణానికి స్థలం సూచిస్తే సర్పంచ్ అంగీకరించడం లేదని విన్నవించారు. కార్యక్రమంలో అన్నాడి రాజిరెడ్డి, క్లోం గంగారెడ్డి, లెంకల మల్లయ్య, జీల ప్రశాంత్, లచ్చయ్య, పర్శరాములు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న నాయకులు శ్రీకాంత్, బన్నీ

జమ్మికుంట: సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, మధ్యాహ్నం మజ్జిగ ఇవాలని అన్నారు. కార్యక్రమంలో బన్నీ, భాను, సందేశ్, తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే 'కాళేశ్వరం'

హుజూరాబాద్: కమీషన్ల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు ఆరోపించారు. ప్రాజెక్ట్‌లోని లోపాలు కప్పిపుచ్చడానికి కాంట్రాక్టర్లు, అధికారులపై నెపం మోపుతున్నారని, ప్రాజెక్ట్‌లో భారీ లోపాలున్నాయంటూ విజిలెన్స్ అధికారుల నివేదికలు తెలియజేస్తున్నాయని దీనికి బీఆర్ఎస్ అధినేత సమాధానం ఇవ్వాలన్నారు.

లేగదూడపై కుక్కల దాడి



మానకొండూరు: మండలంలోని ఖాదర్‌గూడెంలో గాదం అంజయ్యకు చెందిన లేగదూడపై మంగళవారం ఉదయం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి కుక్కలను తరిమికొట్టారు. రెండు నెలల క్రితం ఇదే రైతుకు చెందిన లేగదూడపై కుక్కలు దాడి చేయడంతో దూడ మృతిచెందింది. దీంతో రైతు బోరున విలపించాడు.

ఇప్పుడు నిర్మించకుంటే అప్పటికీ తిప్పలే!

- గర్రెపల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణమయ్యేనా?
- నిధులు మంజూరు.. పనులు సున్నా!
- తారురోడ్డుకు నోచుకోని హామ్లెట్ గ్రామాలు
- వర్షాకాలంలో సైదాపూర్ ప్రజలకు ఏటా తప్పని తిప్పలు



కొట్టుకుపోయిన గర్రెపల్లి-సైదాపూర్ రోడ్డు మధ్యలోని కల్వర్టు

సైదాపూర్: మట్టిరోడ్లకు మహర్దశ లేదు.. తారురోడ్ల నిర్మాణం చేపట్టింది లేదు. ధ్వంసమై రోడ్లకు మరమ్మతులు లేవు. ఎన్నికలకు ముందు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు అప్పటి పాలకులు శిలాఫలకాలు వేసినా పనులు చేసింది లేదు. గర్రెపల్లి వాగుపై గతేదాది వానాకాలంలో వర్షాలకు కల్వర్టు తెగిపోయింది. మరమ్మతు చేయించకపోవడంతో గ్రామస్తులు సోమారం నుంచి సైదాపూర్‌కు ఏడు కిలోమీటర్లు తిరిగి వెళ్లారు. ఎండాకాలంలో వాగులోంచి వాహనాలు వెళుతున్నాయి కానీ మళ్లీ వర్షాకాలంలో సోమారం నుంచి సైదాపూర్‌కు తిరిగి వెళ్లాల్సిందే. బ్రిడ్జి నిర్మాణానికి నిధులున్నా కాంట్రాక్టర్ పనులు చేయించడంలేదు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలని బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపడంలేదు

మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో 15 హామ్లెట్ గ్రామాలున్నాయి. చాలా గ్రామాలకు మట్టి రోడ్లే దిక్కు. అవికూడా సరిగా లేక ప్రజల రాకపోకలకు తీవ్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమారం పంచాయతీ పరిధిలో గర్రెపల్లి, పసికపల్లి గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేదు. గర్రెపల్లి మండల కేంద్రానికి 2 కిలోమీటర్లు, పంచాయతీ కార్యాలయానికి 1.5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మట్టి రోడ్‌తో వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నారు. నాయకులు, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదేరోడ్డులోని రోడ్డాంృం ఏటా వర్షాకాలంలో తెగుతోంది. అయినా శాశ్వత పరిష్కారం చూపడంలేదని గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



వర్షాకాలంలో గర్రెపల్లి- సైదాపూర్ రోడ్డు (ఫైల్)

వర్షాకాలం వస్తే ఇబ్బందులు

తారురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ప్రకటనలు వెలువడినా పనులు జరడంలేదు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సోమారం నుంచి గర్రెపల్లి నుంచి సైదాపూర్ రోడ్డు వరకు రూ.2.40 కోట్లు, వెన్నంపల్లి రోడ్డు నుంచి ఆరెపల్లి వరకు రూ.1.20 కోట్లు, ఘనపూర్ రోడ్డు నుంచి రాయికల్ తండా వరకు రూ.2.80 కోట్లు మంజూరయ్యాయని అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా పనులు చేపట్టలేదు. వర్షాకాలం వస్తే మళ్లీ ఇబ్బందులు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తారురోడ్డు నిర్మించాలి



ఘనపూర్ తారురోడ్డు నుంచి రాయికల్ తండా వరకు తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. తండాలకు సరైన రోడ్డు మార్గం లేక విద్యా, వైద్యం, కనీస అవసరాలకు దూరం అవుతున్నాం. వర్షాకాలంలో మట్టిరోడ్లు బురద,గుంతలమయంగా మారుతుండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వర్షాకాలంలోపు రోడ్డు నిర్మించాలి.

– బాదావత్ భిక్షపతి, మాజీ సర్పంచ్, నల్లాని తండా

ఓటు ఎంతో విలువైంది



తిమ్మాపూర్: కేంద్ర బలగాలు, పోలీసుల కవాతు



చొప్పదండి: సన్మానం చేస్తున్న గ్రామస్తులు

తిమ్మాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ఎస్సై బండి రాజేశ్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించిన అనంతరం ప్రధాన కూడలిలో ఎస్సై మాట్లాడారు. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలు వచ్చాయని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. అందరూ ఓటు వేయాలని, ప్రలోభాలకు తలొగ్గద్దని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

చొప్పదండి: మండలంలోని వెదురుగట్టుకు చెందిన ఆర్మీ అధికారి అడ్డగుంట మల్లయ్య ఉద్యోగ విరమణ పొంది స్వగ్రామానికి రాగా గ్రామస్తులు మంగళవారం ఘనస్వాగతం పలికారు. మొట్టమొదటి జూనియర్ కమిషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. గ్రామస్తులు, స్నేహితులు ఊరేగింపు నిర్వహించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జయహో జనతా ఫౌండేషన్ సైనికులు, ఎక్స్‌సర్వీస్‌మెన్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



శ్రీనివాసనగర్‌లో నెత్తిన బోనాలతో మహిళలు

మానకొండూర్‌రూరల్: మండలంలోని మానకొండూర్, సదాశివపల్లి, శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి గ్రామాల్లోని గౌడ కులస్తులు మంగళవారం ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో ఆలయాలకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

రైతు దీక్షకు తరలిన నాయకులు



దీక్షకు తరలివెళ్తున్న నాయకులు

జమ్మికుంట: జిల్లా కేంద్రంలో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలోని రైతుదీక్షకు జమ్మికుంట పట్టణ బీజేపీ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఈసందర్భంగా ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి, దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, ఆకుల రాజేందర్, పల్లపు రవి, ఠాగూర్ రాజేశ్, కైలాష్ కోటిగణేశ్, తూడి రవిచంద్రారెడ్డి, కొండ్లె పాపయ్య, పత్తి జనార్దన్‌రెడ్డి, యాంసాని సమ్మయ్య, ప్రశాంత్, మోడెం రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బండి సంజయ్

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షతులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. హన్మాజిపల్లె మాజీ ఉప సర్పంచ్ బందెల మల్లేశం, మాజీ వార్డు సభ్యులు సుంకరి శ్రీనివాస్, పురుషోత్తం పృథ్వీరాజ్, అమ్మిగల్ల సతీశ్, రాజు, బాబు, రాజు, పవన్, కొర్వి రాజమల్లు, దురుముట్ల అజయ్, వంగ సంపత్, వీరగోని రాజయ్య, బందెల రమేశ్‌కు సంజయ్ కాషాయా కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మూగ జయశ్రీ, ముత్యాల జగన్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ బండి సంజయ్‌తో అర్కండ్ల గ్రామస్తులు

అర్కండ్లవాగుపై బ్రిడ్జి నిర్మించాలి

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. వీణవంక మండలం నుంచి శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి మంగళవారం రాత్రి కారులో ఎంపీ వెళ్తుండగా గ్రామస్తులు కాన్వాయ్‌ని ఆపి కేశవపట్నం పోలీస్‌స్టేషన్ నుంచి వీణ వంక మండలం చల్లూర్ వరకు అర్కండ్ల మీదుగా డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని, వాగుపై బ్రిడ్జి నిర్మించడం లేదన్నారు. ఎంపీ ఎన్నికలు కాగానే బ్రిడ్జి నిర్మిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం కేశవపట్నంలో వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు.

తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



వెలిచాలలో తాగునీటి బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులు

రామడుగు: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులకు సూచించారు. మండలంలోని వెలిచాలలో మంగళవారం తాగునీటి బావులు, గ్రామనర్సరీ, ప్రకృతి వనం, రీడింగ్‌రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి పరిస్థితిని గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీధర్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక ఉగాది వేడుకల్లో జక్కి మంజుల పాటలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న మంజుల

శంకరపట్నం: కర్ణాటకలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో మండలంలోని అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన జక్కి మంజుల పాటలు పాడి పలువురి ప్రశంసలు అందుకుంది. ఈవేడుకల్లో గానలహరి 2024 జాతీయ సమ్మేళనంలో మంజుల పాల్గొన్నారు. ఆమె పాటలకు నిర్వాహకులు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు ఏకాంబరం, మీనాక్షి రవి, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కబ్రస్తాన్ వద్ద చెత్త తొలిగింపు పనులను మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు మంగళవారం పరిశీలించారు. 11న రంజాన్ నేపథ్యంలో కబ్రస్థాన్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని, ఎలాంటి చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు లేకుండా చేస్తున్నామని తెలిపారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక



బూర మణిహర్ష



గడ్డం ఆరుషిరెడ్డి

గన్నేరువరం: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలోని నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి గన్నేరువరం విజ్ఞాన్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జనవరిలో ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించగా ఆదివారం వెల్లడించిన ఫలితాల్లో బూర మణిహర్ష, గడ్డం ఆరుషిరెడ్డి అర్హత సాధించారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్లు, ప్రిన్స్‌పాల్ భానుచైతన్య, వైస్ ప్రిన్స్‌పాల్ లత, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

బహుజన చక్రవర్తి

సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళి



హుజూరాబాద్: సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



జమ్మికుంట పట్టణంలో పాపన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

హుజూరాబాద్: ని పట్టణంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్నగౌడ వర్ధంతి నిర్వహించారు. సైదాపూర్ రోడ్డులోని పాపన్న విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి రమేశ్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, భీమగోని సురేశ్, సంఘం నాయకులు పంజాల రాంశంకరౌడ్, పెరుమాండ్ల సదానందం, బొనగాని కుమార్, ఎల్లయ్య, కెక్కర్ల సారయ్య, పంజాల శ్రీధర్, అనపురం తిరుపతి,దాసరి ఐలయ్య పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో గౌడసంఘం నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాపన్న వీరోచిన పోరాటాలను కొనియాడారు. సంఘం గౌరవ అధ్యక్షుడు గట్టు వీరన్నగౌడ్, మండల అధ్యక్షుడు పూదరి విజయ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొమురయ్య గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మండ రాజయ్య, సురేష్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంతో పాటు, సర్వాయిపేటలో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాపన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంఘం అధ్యక్షుడు పైడిమల్ల తిరుపతిగౌడ్ అన్నారు. కార్యక్రమంలో పాపన్న గీత కార్మిక సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు పైడిపల్లి రవీందర్‌గౌడ్, బొమ్మకల్ ఎంపీటీసీ ఏరుకొండ ఇందిరసుదీర్‌గౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బొంగోని తిరుపతి, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రవీణ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నం: నివాళి అర్పిస్తున్న నాయకులు



సైదాపూర్: నివాళి అర్పిస్తున్ననాయకులు

ఆభరణాలు పోగొట్టుకున్న ప్రయాణికురాలు

- జమ్మికుంటలో బస్సు దిగుతుండగా ఘటన
- బాధితురాలి స్వస్థలం ఇల్లందు

జమ్మికుంట: ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులో నుంచి కిందికి దిగుతుండగా ఓ మహిళ తన పర్స్, ఆభరణాలు పోగొట్టుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన గాజుల ఇంద్రనీల గత నెల 31న పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తిలోని తల్లిగారింటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఆర్టీసీ బస్సు ఎక్కి, హనుమకొండలో దిగింది. అక్కడి నుంచి హుజూరాబాద్ వెళ్లి, జమ్మికుంట బస్సు ఎక్కింది. బస్టాండ్‌లో దిగే సమయంలో 3 తులాల నల్లపూసల దండ, 2 తులాల బ్రాస్‌లెట్, చెవి కమ్మలు, తులం ముక్కపుడకలు, గుండ్లు ఉన్న పర్స్ కిందపడింది. ఇది గమనించని ఇంద్రనీల బస్సు దిగి, పూలకొట్టు వద్దకు వెళ్లింది. అక్కడ చూసుకోగా పర్స్ కనిపించలేదు. దీంతో బస్టాండ్‌లోని కంట్రోలర్ వద్ద వెళ్లి, బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేయించి, విషయం తెలుపగా తమకు ఎలాంటి పర్స్ కనిపించలేదని సమాధానం ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అఖిల్ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇజ్జిగిరి అఖిల్(23) అనే డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. అఖిల్ గత నెల 30న స్నేహితులను కలిసేందుకు బైక్‌పై హుజూరాబాద్ రూరల్ మండలంలోని సింగాపూర్ వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఆ గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో వాహనం అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చనిపోయాడు.

బ్లాక్‌మెయిల్ పార్టీ బీఆర్ఎస్

విద్యానగర్(కరీంనగర్): ఫోన్ ట్యాపింగ్ చేస్తూ ప్రతిపక్ష నాయకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలు, సినిమా యాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసి కోట్లాది రూపాయలను వసూలు చేసుకున్న పార్టీ బీఆర్ఎస్ అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆరోపించారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. ఇతర పార్టీల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ పార్టీలో చేరేలా ప్రలోభాలకు గురి చేసి పార్టీ ఫిరాయింపులకు తెర తీసిన కేసీఆర్.. ఇప్పుడు ఫిరాయింపుదారులను కుక్కలతో పోల్చడం విడ్డూరంగా ఉందని, ఫోన్ ట్యాపింగ్ చేసి సినిమా వారితో సంబంధాలు పెట్టుకొని కోట్లాది రూపాయల విలువైన భూములను కబ్జా చేసిన కేటీఆర్, హరీష్ రావు సిగ్గు లేకుండా ప్రజల్లో తిరుగుతున్నారని అన్నారు. నాయకులు చంద్రయ్య, సిరి శ్రీధర్, బాపురెడ్డి, నరసయ్య, గజ్జల రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం తగదు

కొత్తపల్లి: కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ మారుతున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కమలాకర్ ఎదుగుదలను ఓర్వలేక కావాలనే కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

సన్మానం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన మోర భద్రేశం ఇంటర్నేషనల్ జిల్లా 320 జీ 2024–25 లయన్స్ క్లబ్ రెండవ ఉపగవర్నర్‌గా విజయం సాధించడంతో గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మంగళవారం సన్మానించారు. సంఘం అధ్యక్షుడు అశోక్, నాయకులు రవి, రాజశేఖర్, సంతు, శ్రీనివాస్, సతీశ్, మధు పలువురు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న నాయకులు అశోక్,రవి, రాజశేఖకర్, సంతు,శ్రీనివాస్,సతీశ్